www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 21 అక్టోబర్ 2024



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పాలకోడేరు

శృంగవృక్షం గ్రామంలో సిద్దయ్య కాల్వ వద్ద రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధుల నుంచి రూ.10 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జంగం సూరిబాబు, ఎంపిటిసి సభ్యులు సత్యకృష్ణ, టిడిపి ముఖ్య నేత కలిదిండి కృష్ణంరాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు ప్రసాద్‌రాజు, కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దశ్యం

పైప్‌లైన్‌తో గ్యాస్ సరఫరా ఎప్పుడో..?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేయాలనే చర్చ రెండు జిల్లాల ప్రజల్లో జోరుగా సాగుతోంది. పక్కనే ఉన్న కృష్ణా జిల్లాలోని అవనిగడ్డలో పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుండటంతో ఏలూరు నగరంతోపాటు జిల్లాలోని ఇతర పట్టణాలు, గ్రామాల్లో ఇది ఎందుకు అమలు చేయడం లేదో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు. పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేస్తే ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.ఎనిమిది వేలకు పైగా ఖర్చు తగ్గే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరాపై పాలకులు దృష్టి సారించాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు.

కృష్ణా జిల్లా అవనిగడ్డలో పైపులైన్ ద్వారా ఇంటింటికీ గ్యాస్

నెలకు కేవలం రూ.200 మాత్రమే బిల్లు

జిల్లాలో ఆ అవకాశమున్నా పట్టించుకోని పాలకులు

అమల్లోకి వస్తే కుటుంబానికి ఏడాదికి రూ.8 వేలుపైనే ఆదా

ప్రతియేటా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. బిపిఎల్ కుటుంబాలకు మాత్రమే ఇది వర్తించే అవకాశం ఉంది. మధ్యతరగతి, ఉద్యోగులు వంటి ఇతరులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందే అవకాశం లేదు. పట్టణ, గ్రామాల్లో నివశిస్తున్న ప్రజలందరికీ పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా జరిగితే ఎంతగానో మేలు జరిగే అవకాశమున్నా ప్రభుత్వం మాత్రం అటువైపు ఆలోచన చేయడం లేదు. పక్కనే ఉన్న కృష్ణా జిల్లాలోని అవనిగడ్డలో ఇది అమలవుతున్నా ఇక్కడ ఎందుకు అమలు చేయడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంది. పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరాకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (జిఎఐఎల్-గెయిల్) కృష్ణా, గోదావరి బేసిన్ (కెజి బేసిన్) గ్యాస్‌ను ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రతి ఇంటికీ పైపులైన్ ద్వారా సరఫరా చేసేందుకు 2005లో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. 2020 నాటికి అందరికీ అందజేస్తామని ప్రకటించింది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం, ఒఎన్‌జిసిపై ఒత్తిడి సైతం తెచ్చింది. చాలా పట్టణాలు, మండల కేంద్రాల్లో ఇంటింటికీ పైపులైన్ ఏర్పాటు చేసినా గ్యాస్ సరఫరా మాత్రం ప్రారంభం కాలేదు. కెజి బేసిన్ గ్యాస్‌ను ఇక్కడి ప్రజల అవసరాలకు వినియోగిస్తే 70 నుంచి 80 శాతం ధరలు తగ్గుతాయి. ప్రస్తుతం ఒక వంట గ్యాస్ సిలిండర్‌కు చెల్లిస్తున్న ధర రూ.900 వరకూ ఉంది. పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేస్తే నెలకు రూ.200 చెల్లిస్తే చాలు. హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్వీట్‌షాపులు, కార్ఖానాలు, చిన్న తరహా కుటీర పరిశ్రమలు వంటివి ప్రస్తుతం చెల్లిస్తున్న ధరల్లో 25 శాతంకన్నా తక్కువ ధరకే గ్యాస్ పొందొచ్చు. కెజి బేసిన్ గ్యాస్‌ను మన రాష్ట్ర ప్రజల అవసరాలు తీరాకే ఇతర రాష్ట్రాలకు ఇవ్వాలని అప్పట్లో రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేసింది. దీనికి ప్రధాన కారణం కెజి బేసిన్ నుంచి గ్యాస్‌ను ఒఎన్‌జిసి 90 శాతం వరకూ గుజరాత్‌లోని రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు తరలిపోతోంది.



అవనిగడ్డ ప్రజల అనుభవం చూసైనా పాఠాలు నేర్వరా..?

కృష్ణా జిల్లా అవనిగడ్డలో ఇంటింటికీ కుళాయి పైపుల మాదిరిగానే వంటగ్యాస్ పైపులు ఏర్పాటు చేశారు. గెయిల్ సంస్థ పైపులైన్ ద్వారా వంటగ్యాస్ సరఫరా చేస్తోంది. ఈ విధానం వల్ల అవనిగడ్డ ప్రజానీకానికి ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న ఇంటికి పైపులైన్ ద్వారా గ్యాస్ వాడుకున్నందుకు రెండు నెలలకు ఒకసారి రూ.400 బిల్లు వస్తోంది. అంటే నెలకు వంటగ్యాస్ బిల్లు రూ.200 మాత్రమే. ఏడాదికి రూ.2400 మాత్రమే చెల్లిస్తున్నారు. జిల్లా ప్రజానీకం వంటగ్యాస్‌కు నెలకు రూ.900 చొప్పున ఏడాదికి రూ.10,800 చెల్లిస్తున్నారు. పైపులైన్ ద్వారా వంట గ్యాస్ సరఫరా జరిగితే అవనిగడ్డలో మాదిరిగా ఏడాదికి రూ.2400 మాత్రమే ఖర్చవుతుంది. ప్రభుత్వం ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందించినా కుటుంబానికి రూ.2700 మాత్రమే లబ్ధి చేకూరుతోంది. ఇంకా ప్రతి కుటుంబం రూ.8,400 వరకూ వంటగ్యాస్‌కు ఖర్చు చేయాలి. అదే పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా జరిగితే ఖర్చు తగ్గుతోంది. గ్యాస్ బుక్ చేసుకునే అవసరంగాని, సిలిండర్ అయిపోతుందనే బెంగగాని ఉండదు. మూడు ఉచిత సిలిండర్ల కంటే గెయిల్ పైపులైన్ గ్యాస్ సరఫరాతో ప్రజలకు ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. రెండు జిల్లాల్లోని దాదాపు పది లక్షల కుటుంబాలకు ఇది ఎంతగానో మేలు చేసే పథకంగా చెప్పొచ్చు. దీనిపై జిల్లాలోని పాలకులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న అభ్యర్థి గోపీమూర్తి

ఎంఎల్‌సి ఎన్నికల్లో.. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

ప్రజా సంఘాల నాయకులు పిలుపు

టీచర్స్ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తిని గెలిపించండి

ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాల్లో రాజకీయ పార్టీల పోటీ తగదు

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్, పట్టభద్రుల ఎంఎల్‌సిల ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సమతా మహిళా భవన్‌లో ప్రజాసంఘాల సమన్వయ కమిటీ సమావేశం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్, పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై ప్రశ్నించేవారు పిడిఎఫ్ ఎంఎల్‌సిలేనని అన్నారు. అసెంబ్లీలో పెద్దల సభగా ఉన్న శాసనమండలిలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, యువజన, విద్యార్థి సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ ఎంఎల్‌సిలు చేసిన కృషి ఎనలేనిదన్నారు. సామాజిక న్యాయం కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం మండలిలో ప్రజలందరి తరపున ప్రాతినిధ్యం వహించేది పిడిఎఫ్ అభ్యర్థులేనన్నారు. పాత ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సిగా ఉన్న షేక్ సాబ్జీ ప్రజా సమస్యలపై పోరాటానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మరణించారని తెలిపారు. ఆయన స్థానంలో ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా బొర్రా గోపీమూర్తి పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తున్న గోపీమూర్తిని గెలిపించాలని ఆయన కోరారు. సిట్టింగ్ ఎంఎల్‌సిగా ఉన్న పట్టభద్రుల నియోజకవర్గంలో కూడా పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు. ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో నేడు రాజకీయాల్లో ఉపాధ్యాయ, ఉద్యోగ, ప్రజాసమస్యలపై పోరాడే అవకాశాన్ని కల్పించాలన్నారు. నేడు అన్ని రాజకీయ పార్టీలు మోసపూరిత హామీలతో ఉపాధ్యాయులను మోసగిస్తున్నారని ధ్వజమెత్తారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని ఉపాధ్యాయ లోకం చేసిన పోరాటాన్ని ఆయన గుర్తు చేశారు. సిపిఎస్ రద్దు కోసం శాసనమండలిలో పోరాడే శక్తి కేవలం పిడిఎఫ్‌కు మాత్రమే ఉందన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై శాసనమండలిలో గళం విప్పడానికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి తనను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సిహెచ్.ప్రసాద్ పాల్గొని మాట్లాడారు.

ఏలూరులో 'భూ'చోళ్లు..!

'ఏలూరు నగరంలోని ఖాళీ భూములపై భూబకాసురుల కన్ను పడిందా.. ఖాళీ జాగాలను కబ్జా చేసే పనిలో అధికార పార్టీ నాయకులు నిమగ్నమయ్యారా.. ఆర్ఆర్‌పేట ఈదరవారి వీధిలోని ఏలూరు ప్రార్థన సమాజం స్థలంపై భూచోళ్ల కన్నుపడిందా.. అందులో భాగంగానే స్థలంలోని మట్టి తరలించడం, చదును చేయడం వంటి పనులు సాగుతున్నాయా'... అంటే అవుననే సమాధానం వస్తోంది. స్థానిక ఎంఎల్‌ఎ ప్రధాన అనుచరులు, కార్పొరేషన్‌లోని పాలకుల కనుసన్నల్లో భూకుట్రలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు వందేళ్ల క్రితం మహాత్మాగాంధీ శంకుస్థాపన చేసిన స్థలాన్ని లీజు పేరుతో అక్రమ పద్ధతిలో సొంతం చేసుకునేందుకు కుట్రలు జరుగుతున్నాయనే చర్చ నగరవాసుల్లో సాగుతోంది.



పక్కన పెట్టేసిన ప్రార్థన సమాజం స్థలం బోర్డు

ఆర్ఆర్‌పేట ఈదరవారివీధిలోని ఏలూరు ప్రార్థనా సమాజం స్థలంపై కన్ను

వందేళ్ల క్రితం మహాత్మగాంధీ శంకుస్థాపన చేసిన స్థలానికే ఎసరు

ట్రాక్టర్లతో మట్టి తరలించి, స్థలాన్ని చదును చేస్తూ ముందుకు

దాదాపు వెయ్యి గజాలు, రూ.20 కోట్ల విలువ చేసే భూమిపై కుట్రలు

ఎంఎల్‌ఎ ప్రధాన అనుచరులు, కార్పొరేషన్‌లోని పాలకులే సుత్రధారులంటూ ఆరోపణలు



చదును చేసిన స్థలం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని ఆర్ఆర్‌పేట ఈదరవారి వీధిలోని వెంకట్రావుపేట స్పెషల్ ఎంసిపి స్కూల్ పక్కన దాదాపు వెయ్యి గజాల ఏలూరు ప్రార్థన సమాజం స్థలం ఉంది. ఈ స్థలంలో 1906లో పురుష సమాజం, 1910లో స్త్రీ సమాజం స్థాపించారు. ఈ ప్రార్థన సమాజం స్థలంలో అప్పట్లో వితంతు వివాహాలు, సతీసహగమనం, బాల్యవివాహాలు, సర్వమత సమ్మేళనం వంటి అనేక అంశాలపై చర్చలు జరిపి ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు జరిగేవని స్థానిక ప్రజలు చెబుతున్నారు. 1921లో మహాత్మాగాంధీ, కస్తూరిబాయ్ ఏలూరుకు విచ్చేసినప్పుడు ఈ స్థలంలో భవన నిర్మాణ ఏర్పాటుకు శంకుస్థాపనసైతం చేశారని చెబుతున్నారు. భవన నిర్మాణం జరగకపోయినప్పటికీ ఒక రేకుల షెడ్డులో ప్రార్థనా సమాజం కార్యకలాపాలు కొనసాగేవని వివరాలు ప్రస్ఫుటం చేస్తున్నాయి. అప్పట్లో ఈ సమాజానికి పని చేసిన వ్యక్తి ఒకరు హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలిసింది. ఈ స్థలంపై మున్సిపాల్టీకి ఎటువంటి హక్కులూ లేవని తెలుస్తోంది. ఈ స్థలంలో ఏర్పాటు చేసిన ఏలూరు ప్రార్థన సమాజం అప్పట్లో సమాజంలోని అనేక సమస్యలపై గొప్పగా పని చేసినట్లు సమాచారం. ఏలూరు జ్యూట్‌మిల్లు యాజమాన్యానికి చెందిన శివగోపాల్ లునాని సైతం ఇక్కడకు సంబంధించిన కార్యక్రమాలకు దాతగా వ్యవహరించినట్లు చెబుతున్నారు. వందేళ్ల క్రితం సమాజంలోని రుగ్మతలపై పోరాడేందుకు కేటాయించిన ఎంతో పవిత్రమైన స్థలం ఇది. ఎన్నో ప్రభుత్వాలు మారినా ఈ స్థలం జోలికి ఇప్పటి వరకూ ఎవరూ వెళ్లలేదు. ప్రస్తుతం ఈ స్థలం ఏలూరు నగరంలోని ప్రధాన సెంటర్‌గా ఉన్న ఆర్ఆర్‌పేటలో ఉంది. ప్రస్తుతం ఇక్కడ గజం స్థలం రూ.రెండు లక్షల వరకూ ఉన్నట్లు చెబుతున్నారు. ఆ ప్రకారం చూస్తే ఈ స్థలం ప్రత్యేక కమిటీని సైతం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ కమిటీ 2014 వరకూ కొనసాగినట్లు ఆధారాలు చెబుతున్నాయి. కమిటీలో ఉన్న వారంతా మరణించడంతో తర్వాత కమిటీ ఉనికిలో లేకుండాపోయిందని చెబుతున్నారు. కమిటీలో ముఖ్య కార్యదర్శిగా ఖరీదు ప్రస్తుత ధరల ప్రకారం రూ.20 కోట్లు వరకూ ఉండొచ్చని అంచనా. ఏలూరు ఎంఎల్‌ఎగా బడేటి బుజ్జి ఉన్న సమయంలోనూ కార్పొరేషన్‌లోని పాలకులు ఈ స్థలంపై కన్నేసినప్పటికీ ఆయన అడ్డుకున్నట్లు తెలుస్తోంది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్పొరేషన్ పాలకులు ఈ స్థలాన్ని సొంతం చేసుకునేందుకు ప్రయత్నించగా ఎంఎల్‌ఎ ఆళ్ల నాని ఒప్పుకోలేదని సమాచారం. కూటమి ప్రభుత్వం రావడంతో కార్పొరేషన్‌లోని ప్రధాన పాలకులంతా టిడిపిలో చేరారు. మళ్లీ ప్రార్థనా సమాజం స్థలాన్ని సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఎంఎల్‌ఎ ప్రధాన అనుచరులతో కలిసి దీనికి కుట్ర పన్నినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. మెల్లగా పావులు కదిపిన సదరు నాయకులు స్థలం చదును పేరుతో రంగప్రవేశం చేసినట్లు చర్చ సాగుతోంది. శనివారం ఈదరవారివీధిలోని ఏలూరు ప్రార్థన సమాజం స్థలాన్ని చదును చేసి అక్కడి మట్టిని ట్రాక్టర్ల ద్వారా బయటికి తరలించారని చెబుతున్నారు. వైసిపికి చెందిన కార్పొరేషన్‌లోని నాయకులు టిడిపిలో చేరి చేస్తున్న దురాగతాలపై పట్టణంలో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. గతంలో వైసిపి నాయకుల్లా టిడిపి ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఎం చంద్రబాబు హెచ్చరించిన కొద్ది రోజుల వ్యవధిలోని ఏలూరులో భూకబ్జాకు తెర తీయడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. లీజు పేరుతో స్థలాన్ని సొంతం చేసుకునేందుకు నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ సాగుతోంది.

గతంలో సబ్బమ్మదేవి స్కూల్ ఆటస్థలం.. ఇప్పుడు ప్రార్థనా సమాజ స్థలం

ఏలూరు నగరంలో ఎంతో పేరొందిన స్కూళ్లలో సుబ్బమ్మదేవి స్కూల్ ఒకటి. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో స్కూల్‌కు సంబంధించిన ఆటస్థలంపై తీవ్రమైన వివాదం సాగింది. దశాబ్దాలపాటు విద్యార్థులు ఆటలు ఆడుకున్న స్థలాన్ని కుట్రలతో రాజకీయ నాయకులు కొట్టేశారనే విమర్శలు అప్పట్లో వెల్లువెత్తాయి. నగర ప్రజలు స్కూల్ ఆటస్థలాన్ని కాపాడుకునేందుకు ఆందోళనలు సైతం చేసిన పరిస్థితి ఉంది. మళ్లీ టిడిపి అధికారంలోకి వచ్చాక ఏలూరు ప్రార్థనా సమాజం స్థలం అన్యాక్రాంతమయ్యే పరిస్థితి నెలకొందనే విమర్శలు విన్పిస్తున్నాయి. వైసిపి పాలనలో నగరంలోని భూకబ్జాలపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇప్పుడు టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంతకంటే దారుణ వ్యవహారాలు కొనసాగుతున్నాయనే చర్చ నగర ప్రజల్లో నెలకొంది.

నాకు తెలియదు.. కనుక్కుంటా..

ఎ.భానుప్రతాప్, ఏలూరు నగర కమిషనర్

ఆర్ఆర్‌పేటలోని ఈదరవారి వీధిలోని ఏలూరు ప్రార్థనా సమాజం స్థలంపై కార్పొరేషన్ కమిషనర్‌ను ప్రజాశక్తి వివరణ కోరింది. ఈ స్థలం కార్పొరేషన్ పరిధిలో ఉందా అని అడగ్గా తనకు (ఐడియా) తెలీదని చెప్పారు. స్థలంలో మట్టి తరలింపు పనులపై ప్రస్తావించగా తాను ప్రస్తుతం ఒక వర్క్‌షాపు నిమిత్తం ఢిల్లీ వెళ్తున్నానని, వివరాలు కనుక్కుంటానని చెప్పారు.

రోడ్లు వేయకపోతే విధులు బహిష్కరిస్తాం

పారిశుధ్య కార్మికులు హెచ్చరిక

ప్రజాశక్తి - వీరవాసరం

తమ కాలనీకి వెళ్లే రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహించడం తగదని, తక్షణం తమ రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరుతూ వీరవాసరం పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఆదివారం ఆందోళన చేపట్టారు. లేనిపక్షంలో విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. పంచాయతీరాజ్ వారోత్సవాల్లో భాగంగా పలు గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఆదివారం ప్రారంభించారు. వీరవాసరంలో కూడా సీసీ రోడ్ల పనులను ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఎంఎల్‌ఎ వద్ద తమ గోడును మొర పెట్టుకుందామంటే నాయకులు అడ్డు తగలడంతో వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ రహదారి అభివృద్ధి కాగితాలకే పరిమితమైందని, ఇంత వరకు ఏ నాయకుడూ పట్టించుకున్న దాఖలాల్లేవని ఆవేదన వ్యక్తం చేశారు. సిమెంట్ రోడ్లపై మళ్లీ రోడ్లు వేస్తున్నారని, తమ రహదారి ఎందుకు అభివృద్ధి చేయరని వారు ప్రశ్నిస్తున్నారు. వీరవాసరంలో సిమెంట్ రోడ్లపై రోడ్లు వేస్తున్నారంటూ పత్రికల్లో కథనాలు రావడంతో అవసరం లేని ఒక రోడ్డు పనులు రద్దు చేశారు. మార్కెట్, రైల్వే గేటు వద్ద రెండు రహదారుల పనులను ఎంఎల్‌ఎ ప్రారంభించారు. సిమెంట్ రోడ్డుపై మళ్లీ సిమెంట్ రోడ్డు వేయాలని కోరిన ఎంపిటిసి గుళ్లిపల్లి విజయలక్ష్మీ యూటర్న్ తీసుకుని తాను అధికారులకు చూపిన రోడ్లుపై రోడ్లు అవసరం లేదని సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టడం గమనార్హం.



నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు



మంత్రి నిమ్మలకు మెమెంటో అందిస్తున్న గోపీమూర్తి

ఐదేళ్ల వైసిపి పాలనలో విద్యా వ్యవస్థ నాశనం

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నాశనమైందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు గర్ల్స్ హైస్కూల్లో ఆదివారం జరిగిన యుటిఎఫ్ యలమంచిలి మండల స్వర్ణోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంతో కాలంగా ప్రాథమిక విద్య అంటే 1-5 తరగతుల మధ్య విద్య అని అందరికీ తెలుసని, అయితే నియంతృత్వ జగన్ స్కూళ్లను విడగొట్టి అక్కాచెల్లెళ్లను వేరే చేశారన్నారు. దీనికి వ్యతిరేకంగా సాగిన ఆందోళనల్లో యుటిఎఫ్‌తోపాటు తాను కూడా పాల్గొన్నానని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక గతంలో ఉన్న జిఒ 117ను రద్దు చేసినట్లు గుర్తు చేశారు. ప్రాథమిక విద్యను ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు అందకుండా చేయాలనే దురుద్దేశంతోనే జిఒ 117ను జగన్ ప్రభుత్వం తెచ్చిందని విమర్శించారు. ఉపాధ్యాయులు రక్తదాన శిబిరం, వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. స్వర్ణోత్సవ వేడుకలను ఉమ్మడి జిల్లా జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, పిడిఎఫ్ టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, కార్యదర్శి పోలిశెట్టి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలొద్దు

ఎక్సైజ్ సిఐకు వివేకానందకాలనీ వాసుల వినతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్


పాలకోడేరులో ఒకటో వార్డులోని వివేకానందకాలనీకి ఆనుకుని గొల్లలకోడేరు బ్రిడ్జి డౌన్‌లో తమ నివాసాల సమీపంలో మద్యం షాపు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారని, దాన్ని తక్షణం ఆపాలని కాలనీవాసులు ఎక్సైజ్ సిఐ బలరామరాజును కోరారు. సిఐకు కాలనీవాసులు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. గతంలో ఈ ప్రాంతంలో మద్యం దుకాణాలు పెట్టడం వల్ల తామంతా తీవ్ర ఇబ్బందులు పడ్డామని తెలిపారు. కాలనీలో పలు ఇళ్లల్లో చోరీలు జరిగి విలువైన వస్తువులు కోల్పోయామని, దీనిపై కేసులు కూడా పెట్టామని చెప్పారు. ఈ మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలన్నారు. దీనిపై సిఐ బలరామరాజు స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వివేకానంద కాలనీవాసులు ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు వినతిపత్రం అందించారు. సమస్యను పరిష్కరిస్తానని ఎంఎల్‌ఎ హామీ ఇచ్చారు.



ఎక్సైజ్ సిఐ బలరామరాజుకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

టిడిపి ఎంఎల్‌సి అభ్యర్థిగా పేరాబత్తుల

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి



ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థిగా పేరాబత్తుల రాఖశేఖర్‌ను టిడిపి అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేరాబత్తుల రాజశేఖర్ టిడిపిలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేశారు. గతంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జడ్‌పిటిసి సభ్యునిగా పనిచేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపిని అంటిపెట్టుకుని ఉన్నారు. ముమ్మిడివరం ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజుకు అత్యంత సన్నిహితుడు. ఎన్నికలకు ముందు టిడిపి అధినేత చంద్రబాబుకు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో కాకినాడ రూరల్ నుంచి టిడిపి టిక్కెట్‌ను ఆశించారు. అయితే పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించడంతో రాజశేఖర్‌కు టికెట్టు దక్కలేదు. ఇటీవల తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మంత్రులు, ఎంఎల్‌ఎలు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా పేరాబత్తుల పేరును ప్రతిపాదించినట్టు సమాచారం. ఆ నివేదిక మేరకే అధిష్టానం రాజశేఖర్ పేరును ఖరారు చేసింది.

బిసి రక్షణ చట్టం రూపకల్పనకు చర్యలు అభినందనీయం

టిడిపి ఉండి నియోజకవర్గ బిసి నాయకుడు రాంబాబు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం బిసి రక్షణ చట్టం రూపకల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవడం అభినందనీయమని ఉండి నియోజకవర్గ బిసి నాయకుడు కామన రాంబాబు అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ చట్టం రూపకల్పనతో బిసిలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని చెప్పారు. బిసిలపై దాడులు, వేధింపులు జరగకుండా నియంత్రణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇటువంటి ఘటనల్లో శిక్షలు పడే విధంగా ఈ చట్టం దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. టిడిపి హయాంలోనే బిసిలకు సముచిత స్థానం లభిస్తుందనడానికి ఈ చట్ట రూపకల్పనే నిదర్శనమని చెప్పారు.

అన్నదాత ఆందోళన..!

వరి రైతును నిండా ముంచిన వానలు

ప్రజాశక్తి - ఆకివీడు

కురుస్తున్న వర్షాలు వరి రైతులను నిండా ముంచాయి. మిగిలిన కొద్ది మాత్రవు వరిచేలు పూర్తిగా నీట మునిగిపోతున్నాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా మండలంలో 70 శాతం వరి చేలు వరదల పాలై కుళ్లిపోయాయి. మిగిలిన పంట అయినా చేతికందుతుందని ఆశతో ఉన్న రైతులను ఇటీవల కురుస్తున్న వర్షాలు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. వర్షాల కారణంగా చేలు పూర్తిగా నీట మునిగిపోయి పనికిరాకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. మండలంలో 3,984 ఎకరాల్లో రైతులు సార్వా సాగు చేపట్టారు. అందులో 2,084 ఎకరాల్లో వరిచేలు పూర్తిగా నీటమునిగిపోయి కుళ్లిపోయాయి. మిగిలిన భాగం ఆశాజనకంగా ఉందని అధికారులు లెక్కలు చెబుతున్నాయి. వరదల సమయంలో వెయ్యి ఎకరాలు కుళ్లిపోయిందని అధికారులు అంచనాల వేశారు. మిగిలిన వెయ్యి ఎకరాల్లో కనీసం 50 శాతం పంట అయినా చేతికొస్తుందని ఆశించారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఉన్నది కూడా పోతుందా అని సందేహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, పంట చేతికందకపోతే నష్టాల ఊబిలో కూరుకుపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కౌలు రైతుల సంగతి చెప్పనక్కర్లేదు. మొత్తం మండలంలో కౌలు రైతులు 10 నుంచి 20 శాతం మంది మాత్రమే లబ్ధి పొందుతున్నారు. అగ్రవర్ణాల కౌలు రైతులకు ఆ అవకాశం లేదు. కులం పేరుతో వారు పూర్తిగా నష్టపోవాల్సిందే. వానలు తగ్గితే చేలు మరోసారి దమ్ము చేసి ఇక పంటకు రైతు సిద్ధం కావాల్సిన పరిస్థితి.



వర్షాల నేపథ్యంలో నీటమునిగిన వరిచేలను చూపతున్న రైతులు



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు

శరవేగంగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామాల్లో సిమెంట్ రోడ్లు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణ రాజు తెలిపారు. మండలంలోని కాళ్ల, కోపల్లె గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా ఎంఎల్‌ఎ పలు సిమెంట్ రోడ్ల పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకే పల్లె పండుగ జరుగుతుందన్నారు. ఇప్పటికే ప్రారంభించిన పనుల్లో భాగంగా సిమెంట్ రోడ్ల శరవేగంగా జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో ఇంకా చేపట్టాల్సిన సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, మిగతా పనులు జనవరి14 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంతో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాళ్ల సర్పంచి బందా విజయసుధ, ఉప సర్పంచి వన్నాసి వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి బి.సతీష్‌కుమార్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



అన్నదానానికి విరాళం అందజేస్తున్న సభ్యులు

అన్నదానానికి శ్రీదేవి ట్రస్టు సాయం

ప్రజాశక్తి - కాళ్ల

అన్నసమారాధనకు దాట్ల శ్రీదేవి ట్రస్టు అధినేత దాట్ల వెంకట రామరాజు నగదు అందించేందుకు ముందుకొచ్చారు. కాళ్లకూరులో పూజారుల వంతెన ప్రాంతంలో జరిగే అన్న సమారాధనకు ఆర్థిక సాయం అందించారు. అన్న సమారాధన ఆదివారం నిర్వహించారు. రెండు బస్తాల బియ్యం, 20 లీటర్ల పెరుగు, 1000 లీటర్ల ఆర్‌ఒ వాటర్‌ను దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యులు పెన్మత్స నాగరాజు చేతులమీదుగా అందజేశారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - కాళ్ల

సీసలి గ్రామంలో రూ.20 లక్షల విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచి బి.ధనలక్ష్మి శ్రీనివాస్ పేర్కొన్నారు. సీసలిలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలువురు ప్రజాప్రతినిధులు ఆదివారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎంజిఎన్‌ఆర్ఇజిఎస్ నిధులు రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. నరసాపురం పార్లమెంట్ నిధులు రూ.10 లక్షలతో క్రిమిషన్ షెడ్డు నిర్మాణ పనులకు భూమి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి కట్రేడ్డి శ్రీనివాసరావు, జనసేన సీసలి గ్రామ అధ్యక్షులు నూకల భోగేంద్రబాబు, గ్రామ కార్యదర్శి తోట బాలకృష్ణ, టిడిపి నాయకులు నల్ల శ్రీను, గణేశ్న పద్మారావు, వాస్కూరి శ్రీనివాస్, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.



సీసలిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచి ధనలక్ష్మి శ్రీనివాస్



మామిడూరులో జనసేన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలం మామిడూరులో జనసేన కార్యాలయాన్ని ఆదివారం పార్టీ మండల అధ్యక్షులు కోయ వెంకట కార్తీక్ ప్రారంభించారు. జనసేన కార్యాలయం కోసం తన సొంత ఆఫీస్‌ను కేటాయించిన వానపల్లి హనుమాన్‌కు జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తరఫున, జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు తరపున, పెనుమంట్ర మండల అధ్యక్షులు కోయ వెంకట కార్తీక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే మామిడూరులో మాజీ వైసిపి నాయకులు మామిడూరు గ్రామ శివాలయం దేవస్థానం మాజీ ఛైర్మన్ ముంగండ శివగణేష్, నాయకులు నాయకులు కానూరు సూర్యనారాయణ పార్టీలో చేరారు.

22 నుంచి గ్రామాల్లో ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - గణపవరం

ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి ఆదివారం తెలిపారు. మండలంలో 22, 23 తేదీల్లో గణపవరం జిల్లా పరిషత్ బాలురు, బాలికల హైస్కూళ్లలో ఈ నెల 24న గణపవరం రెండు, నాలుగు సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాశీపాడు జిల్లా పరిషత్ హైస్కూలు జల్లికాకినాడ, కొత్తపల్లి, సరిపల్లి, అప్పన్నపేట, మొయ్యేరు గ్రామాల్లోని సచివాలయాల్లో, పిప్పర, అలాగే ఎ.గోపవరం గ్రామ సచివాలయంలో క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానికులు ఆధార్ కార్డుల్లో పేర్ల మార్పులు, చేర్పులు, వేలిముద్రలు సరిచేసుకోవాలని కోరారు

మెడలో గొలుసు తెంపేందుకు దొంగల యత్నం

మోటారు సైకిల్‌పై నుంచి పడి భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి - పాలకోడేరు

మోటార్ సైకిల్‌పై వెళ్తున్న మహిళ మెడలో గొలుసు దొంగిలించేందుకు దొంగలు ప్రయత్నించిన ఘటన గొల్లలకోడేరు శివార్లలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనలో మహిళతో సహా ఆమె భర్త మోటారు సైకిల్‌పై నుంచి కిందకు పడిపోవడంతో ఇరువురు గాయాల పాలయ్యారు. దీనికి సంబంధించి పాలకోడేరు ఎస్‌ఐ ఎం.రవివర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరగపర్రుకు చెందిన చామన శ్రీను శనివారం రాత్రి తన భార్యతో కలిసి మోటార్ సైకిల్‌పై భీమవరం వచ్చారు. పని ముగించుకుని భీమవరం నుంచి తిరిగి గరగపర్రు బయల్దేరారు. గొల్లలకోడేరు గ్రామం దాటిన తర్వాత ఉన్న ఆలయ సమీపంలో ఇద్దరు వ్యక్తులు అప్పటికే మోటారు సైకిల్‌పై కాపు కాశారు. వారు శ్రీను భార్య మెడలో ఉన్న గొలుసును తెంపేందుకు యత్నించగా శ్రీను భార్య ఆ గొలుసును గట్టిగా పట్టుకుంది. ఈ పెనుగులాటలో భార్యాభర్తలు ఇద్దరు కిందపడిపోయారు. ఈ ఘటనలో మహిళ తలకు తీవ్ర గాయమవ్వగా, భర్త శ్రీనుకు కాలు విరిగిందని ఎస్‌ఐ తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ రవివర్మ వెల్లడించారు .

సినీరంగంలో ఒక ఆణిముత్యం హాస్యనటులు రాజబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సినీరంగంలో ఒక ఆణిముత్యం హాస్యనటులు రాజబాబు అని, హాస్యానికే భాష్యం చెప్పిన రాజబాబు చిరస్మరణీయులని ప్రముఖ నిర్మాత దర్శకులు తుమ్మలపల్లి రామసత్యనారాయణ అన్నారు. ఆదివారం వెంకట్రామ థియేటర్ కన్ఫరెన్స్ హాల్లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రముఖ హాస్యనటులు పుణ్యమూర్తుల అప్పలరాజు (రాజబాబు) జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రాజబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నిర్మాత రామ సత్యనారాయణ మాట్లాడుతూ తనకంటూ ప్రత్యేకత గల సహజ హాస్యనటులు రాజబాబు ఆనాటి అగ్రనటులతో కలిసి నటించారని, రాజబాబు సినిమాలో నటిస్తున్నారంటే ప్రేక్షకులు ఎగబడి వచ్చేవారని తెలిపారు. కళా రంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది దాశరథి శ్రీనివాస్ మాట్లాడుతూ మన జిల్లా వాసి అయిన రాజబాబు ముందు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తూ నాటకాలపై మోజుతో నాటక ప్రదర్శనలు ఇచ్చారని తెలిపారు. మంచి హాస్య నటుడిగా గుర్తింపు పొందారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి సభ్యులు మల్లుల సీతారామ ప్రసాద్, ఉండపల్లి రమేష్ నాయుడు, చల్లా రాము, తుమ్మలపల్లి ఆంజనేయ గుప్తా పాల్గొన్నారు.



మొగల్తూరు : జానకీరామ్‌కు శుభాకాంక్షల తెలుపుతున్న నేతలు

ఘనంగా జానకీరామ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం


నరసాపురం మాజీ ఎంఎల్‌ఎ కొత్తపల్లి జానకీరామ్ పుట్టినరోజు వేడుకలు ఆయన స్వగృహంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జానకీరామ్‌కు నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ శుభాకాంక్షలు తెలిపారు. జానకీరామ్‌కు నాయకర్ పుష్పగుచ్ఛం అందజేసి కేకు తినిపించారు. ఈ కార్యక్రమంలో వలవల నాని, కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఘంటా కృష్ణ, వల్లభరెడ్డి రామకోటి, ఆకన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: మాజీ ఎంఎల్‌ఎ కొత్తపల్లి జానకీరామ్ జన్మదిన వేడుకలను అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను టిడిపి మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, మాజీ సర్పంచులు మేళం బన్ను, మామిడిశెట్టి సత్యనారాయణ, కర్రి వీరాస్వామి కట్ చేశారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో నరసింహారావు, దొంగ స్వామి, మైలాబత్తుల రాంబాబు, దోసలపూడి దొరబాబు, దేశంశెట్టి శ్రీను, మెండు రాజేష్, పాలా రాంబాబు, గుడాల చింతన్న తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హి సేవ ప్రశంసా పత్రాలు అందజేత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ బాలికల హాస్టల్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించే కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో హాస్టల్లో ఆదివారం నిర్వహించారు. హాస్టల్ వార్డెన్లు శ్యామల, భానుమణి మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ ప్రవేశపెట్టిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా సెప్టెంబర్ నుంచి తమ హాస్టల్లో పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇటువంటి ప్రశంసాపత్రాలను అందించడం మరింత ప్రోత్సాహకరమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రభుత్వ బాలికల హాస్టల్లో విద్యార్థులు మొక్కలు నాటడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, గదులను శుభ్ర పరిచుకుని తోటివారికి ఆదర్శంగా ఉన్నారని తెలిపారు. ఈ మేరకు 56 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించామన్నారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, పి.అమూల్యారావు, కొండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న దృశ్యం

ఉత్తమ నాటిక 'దుర్దశ'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం టౌన్

ప్రపంచ కళాజాతర బుద్ధాల కన్వెన్షన్ హాల్, తాడేపల్లిగూడెంలో శ్రీశ్రీ కళావేదిక సౌజన్యతో నిర్వహించారని, దుర్దశ ఒడియా నాటిక ఉత్తమ బహుమతి కైవసం చేసుకుందని, వరల్డ్ రికార్డు బుక్కులో నాటికను నమోదు చేశారని డాక్టర్ కుమార్‌నాయక్ తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతినాయకుని అవార్డును తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావు, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ తనకు అవార్డు ప్రదానం చేశారని నాయక్ అన్నారు. డాక్టర్ తిరుపతి సాహూ రచనా దర్శకత్వంలో సాగిన ఈనాటికలో డాక్టర్ కుమార్ నాయక్, భంజదేవ్ సమంత, కుర గౌడ, రోషన్ సుభాష్ షాహో, చందమామ నటించగా ప్లే బ్యాక్ సింగర్ గా రమేష్ సాయి నటించారు.

అభివృద్ధి పనులకు ఎంఎల్‌ఎ ప్రారంభోత్సవాలు

మొగల్తూరు:మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నిర్వహించే పల్లె పండగ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొనున్నారని ఆయన కార్యాలయ సిబ్బంది తెలిపారు. మండలంలోని పాతపాడు, జగన్నాధపురం, కాళీపట్నం పడమర, కొత్తోట, పేరుపాలెం సౌత్, రామన్నపాలెం గ్రామాల్లో పలు అంతర్గత రహదారులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు.

పరిమి సత్యనారాయణకు రైతునేస్తం పురస్కారం

ఉంగుటూరు: మండలంలోని వెల్లమిల్లి గ్రామానికి చెందిన పరిమి సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శనీయంగా నిలుస్తున్నందుకు రైతునేస్తం పురస్కారాన్ని అందుకున్నారు. మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు చేతుల మీదుగా ఆదివారం కృష్ణా జిల్లా ఆత్కూరుకు చెందిన స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 20 మంది రైతులను ఎంపిక చేయగా వారిలో పరిమి సత్యనారాయణ ఒకరు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం గన్నాబత్తుల పెదతాత, తులసమ్మ తెలగా కళ్యాణ మండపంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన నర్సాపురం శాఖ, రాయల్ క్లబ్ వారి ఆధ్వర్యంలో అఖిల భారత తెలగ, బలిజ, కాపు సంఘం, మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన ప్రవాస భారతీయ స్కాలర్ షిప్స్ పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాయల్ క్లబ్ జాతీయ కార్యవర్గ అధ్యక్షుడు చినమిల్లి సత్యనారాయణరావు విచ్చేసి ప్రసంగించారు. భావిభారత పౌరులైన విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను, వ్యక్తిత్వ వికాశాన్ని పెంపొందించుకుని వారి జీవితాన్ని సక్రమమైన బాటలో నడిపించుకొని జీవితంలో అగ్రస్థానంలో ఉండేటట్లుగా ప్రతిభ గల విద్యార్థులకు రాయల్ క్లబ్ వంటి సంస్థలు చేయూత నిస్తున్నాయన్నారు. ఎందరో ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక పరిస్థితులు అడ్డు పడుతున్నాయని, అటువంటి వారికి ఎలాంటి ఆటంకం కలగకుండా రాయల్ క్లబ్ అందిస్తున్న ఉపకార వేతనాలు బాగా ఉపయోగ పడతాయన్నారు. సమాజం ఆరోగ్య ఉండాలంటే మంచి విద్య, వైద్యమే కారణమని అన్నారు. ఎన్ఆర్ఐ. స్కాలర్‌షిప్ మహోత్సవం ద్వారా ప్రతిభ గల విద్యార్థులకు చేయూతగా 76 మంది ప్రతిభ గల విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.12,000 చొప్పున స్కాలర్‌షిప్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఫౌండర్ అండ్ సెక్రటరీ, శ్రీరావు వి.అద్దేపల్లి, బోర్డు అఫ్ డైరెక్టర్ శివ అల్లు, డైరెక్టర్-ఇండియా, పీర్ల స్వామి అల్లు, అఖిల భారత తెలగ, బలిజ, కాపు సంఘం ట్రస్టీ మెంబెర్ సి హెచ్.గోపాలకృష్ణ, లైఫ్ మెంబెర్ మేళం శ్రీనివాస్ పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న సభ్యులు

లోటు బడ్జెట్‌లో ఉన్నా నిధుల కొరత లేదు

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని బూరుగుపల్లి, దొడ్డిపట్ల గ్రామాల్లో పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా రూ.35 లక్షలతో ఆదివారం వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంయుక్తంగా పాల్గొని భూమి పూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. దొడ్డిపట్ల జిల్లా పరిషత్ హైస్కూలు వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పూజ్య బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నేడు పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీలను నిర్వీర్యం చేసి సర్పంచులను భిక్షాటన చేసేలా చేస్తే నేటి ప్రభుత్వం పంచాయతీల ఆర్థిక పరిపుష్టిని పెంచి పాలకవర్గాన్ని తలెత్తుకునేలా చేశామన్నారు. గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నిధులను పక్కదారి మళ్లించి స్థానిక సంస్థలను పనికిరాని సంస్థలుగా చేసిందన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయన్నారు. గతంలో గ్రామ పంచాయతీలకు నిధులు లేక కనీసం బ్లీచింగు, సున్నం కూడా వేసుకోలేని పరిస్థితి ఉండేదన్నారు. ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పంచాయతీల పరిస్థితులను అర్థం చేసుకున్నారన్నారు. నిమ్మల మంచి ప్రజా నాయకుడని అన్నారు. శంకుస్థాపనలు చేసిన పనులన్నీ సంక్రాంతి నాటికి పూర్తయ్యి గ్రామ సీమలకు పూర్వ వైభవం వస్తుందని అన్నారు. జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఉపాధి హామీ కింద ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని దినాలు కల్పించాలని, నిర్ణీత సమయంలో వారికి డబ్బు జమ చేయాలని, చేసిన పనులు నాణ్యతతో ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులను గ్రామ సర్పంచి, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తేనే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, డ్వామా పీడీ డాక్టర్ కెసి హెచ్.అప్పారావు, జిల్లా పంచాయతీరాజ్ ఇఇ కెఎస్ఎస్.శ్రీనివాసరావు, తహశీల్దారు గ్రంధి పవన్, ఎంపిడిఒ ఎన్.ప్రేమాన్విత, వివిధ శాఖలు అధికారులు, గ్రామ సర్పంచులు చెల్లుబోయిన ప్రమీలకుమారి, చెల్లింకుల లక్ష్మి, నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బోణం చినబాబు, చిట్టూరి సీతారామాంజనేయులు, బొప్పన హరి కిషోర్, మాత రత్నంరాజు, ఆరిమిల్లి రామశ్రీనివాసు, బన్ని వాసు, ముచ్చర్ల శ్రీనివాసరావు, బోనం నాని, రుద్రరాజు సత్యనారాయణరాజు, పీతల శ్రీనివాసు, దేగల సత్తిపండు, గుబ్బల మోహన్, రేఖపల్లి వెంకటరెడ్డినాయుడు, కొడవటి వరబాబు, తాళ్ల నాగరాజు, పాలవలస తులసీరావు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిమ్మల రామానాయుడు

ముదినేపల్లిలో కోతులు పట్టివేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లి గ్రామస్తులను ముప్పుతిప్పలు పెడుతున్న కోతులను పట్టించే కార్యక్రమం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టారు. రెండు రోజులుగా కోతులను పట్టే వ్యక్తులు అంబేద్కర్ నగర్‌లో తిరుగుతూ కోతులను పట్టి బోనులో బంధిస్తున్నారు. రెండు రోజులుగా 70 కోతులను వేటాడి బోనుల్లో బంధించారు. వీటిని ఆదివారం ప్రత్యేక వాహనంలో భద్రాచలం అడవులకు తరలించినట్లు సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ తెలిపారు. గ్రామంలో మిగిలిన ఉన్న కోతులను పట్టించే కార్యక్రమం కొనసాగుతుందన్నారు.



పట్టిన కోతులు

నేడు జల్లి కొమ్మరలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో సోమవారం ఉదయం జల్లికొమ్మరలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పశువర్థక శాఖాధికారులు తెలిపారు. ఈ శిబిరాన్ని ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు ప్రారంభిస్తారని చెప్పారు. స్థానికులు తమ పశువులకు వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ వారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలూ కలగకుండా ఏర్పాట్లు చేశారు.

మావుళ్లమ్మకు నాలుగు గ్రాముల బంగారం విరాళం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

శ్రీ మావుళ్లమ్మ అమ్మవారికి తూర్పుగోదావరి సామర్లకోటకు చెందిన రామలక్ష్మణమూర్తి సులోచన రాణి దంపతులు నాలుగు గ్రాముల బంగారం విరాళంగా ఆదివారం ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్‌కు అందజేశారు.

నేడు, రేపు ఏలూరు జిల్లాలో మంత్రి నాదెండ్ల పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లాలో రెండు రోజులు పర్యటించనున్నారు. ఈ నెల 21వ తేదీ సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ద్వారకాతిరుమల చేరుకుని శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని రాత్రికి ద్వారకాతిరుమలలో బస చేస్తారు. 22వ తేదీ మంగళవారం ఉదయం పది గంటలకు ద్వారకాతిరుమల నుండి బయలుదేరి 10:30కి ఏలూరు కలెక్టరేట్ చేరుకుని జిల్లా అధికారులతో సమావేశమవుతారు. తిరిగి 11 గంటలకు ఏలూరు నుండి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు ఉంగుటూరు ధాన్యం కొనుగోలు కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటలకు ఉంగుటూరు నుండి బయలుదేరి విజయవాడ వెళ్తారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జట్లు ఎంపిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు జిల్లా జూనియర్ జట్ల ఎంపిక మండలంలోని బొర్రంపాలెం హైస్కూల్లో ఆదివారం జరిగింది. చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించే 43వ రాష్ట్రస్థాయి అండర్-18 ఖోఖో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ పోటీలను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు కె.రమేష్ ప్రారంభించగా జిల్లాస్థాయి జట్టుకు బాలికలు 40 మంది, బాలురు 50 మంది హాజరవ్వగా 15 మంది బాలికలు, 15 మంది బాలురు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు గొడుగు శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష కార్యదర్శులు సాంబశివరావు, రంగారావు, ప్రధానోపాధ్యాయుడు ఆలీ ఆధ్వర్యంలో ఎంపిక నిర్వహించారు.

జాతీయస్థాయి చదరంగ పోటీలకు నూజివీడు విద్యార్థి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

గుంటూరు జిల్లా గోరంట్లలోని నెక్స్ జెన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఈ నెల 15 నుండి 17 వరకు జరిగిన అండర్-15 రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో నూజివీడు కుమార్ సిబిఎస్ఇ పాఠశాల విద్యార్థి కొల్ల భవన్ అత్యంత ప్రతిభ కనపరిచి ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఛైర్మన్ వెంకట కుమార్ తెలిపారు. ఈ విద్యార్థి నవంబర్ మూడో తేదీ నుండి 11వ తేదీ వరకు తమిళనాడులోని హోసూరులో జరిగే జాతీయస్థాయి చదరంగం పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ఆడుతున్నట్లు వెంకట్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బాలుడు తల్లిదండ్రులను, కోచ్‌ను ఆయన అభినందించారు.

